క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గౌస్ ఆజామ్ పేర్కొన్నారు. సోమవారం ఈ వ్యాసరచన పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 'మీరు సూపర్ హీరోలుగా ఊహించండి – ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని రహదారుల్లో పిల్లలను సురక్షితంగా చేయడమే లక్ష్యం' అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించామని వివరించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలతో పాటు సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. అదే విధంగా జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ. 25 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలుతో పాటు సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు విజయ్ భాస్కర్, రామ శంకర్, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో దాదాపు రూ. 50 కోట్ల మేర పంట నష్టం జరిగితే కేవలం రూ.2.14 కోట్లు మాత్రమే నష్టం జరిగిందని జిల్లా అధికార యంత్రాంగం నివేదిక ఇవ్వడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు తిరుమల్లేష్, శ్యామలాదేవి, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో అక్రమాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని రైతు బజారు బాడుగల అక్రమాలపై విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా రైతు బజారుకు ఎస్టేట్ ఆఫీసర్ లేకపోవడంతో రైతు బజారు సిబ్బంది రసీదులు ఇవ్వకుండా వసూలు చేసి అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. అధికారులు స్పందించి రైతు బజారులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య కోరారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో దళితులు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఆయా సమస్యలపై మంగళవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద చేస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు చంద్రశేఖర్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయి హమాలీల ఉపాధిని దెబ్బతీయొద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పౌర సరఫరాల శాఖలోని హమాలీల ఉపాధి దెబ్బతీయొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సివిల్ సప్లయి హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల హక్కులను హరిస్తున్నాయని మండిపడ్డారు. ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, మురారి, వెంకటరమణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సినిమా పోస్టర్ విడుదల

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో సోమవారం సినీ పోస్టర్‌ను విడుదల చేశారు. శ్రీకృష్ణ సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'ద బీచ్ హౌస్ హర్రర్' సినిమాకు చెందిన పోస్టర్లను ఆ సినిమా సాంకేతిక బృందం విడుదల చేసింది. ఈ సినిమాకు నిర్మాతలుగా వందన, నాగరాజు వ్యవహరిస్తున్నారు. బద్రి ప్రసాద్ దర్శకుడిగా, అర్జున్ సహ దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ సినిమా నిర్మాణ పనులు జులైలో పూర్తవుతాయని తెలిపారు. సారథి మూవీ డైరెక్టర్ జాకట రమేష్, శ్రీరామ్ చిట్స్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, భరత్ పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రత ముఖ్యం



నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ దంతవైద్య కళాశాల వైద్యులు

కడప అర్బన్: ప్రతి ఒక్కరూ నోటి పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు అన్నారు. నోటి పరిశుభ్రత ఉంటే రోగాలు దరిచేరవన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో సోమవారం కడప పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ విభాగంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో డాక్టర్ శ్వేత, డాక్టర్ నారాయణ రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ విజయలక్ష్మి, రాఖీజ్‌లు నోటి ఆరోగ్యం సూచనలను అందించారు. ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు, ఓరల్ బ్రషింగ్ ఆరోగ్య విద్య, నోటి క్యాన్సర్ నివారణపై అవగాహన, పొగాకు నమలడంతో నోటి ప్రభావాలు, నోటి క్యాన్సర్ సంకేతాలు, లక్షణాలు, పిల్లలకు బ్రష్ చేయడంలో మెలకువలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

వైవీయూలో అందుబాటులోకి నిఘానేత్రం



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఐటీసెల్ ప్రతినిధులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎట్టకేలకు నిఘా నేత్రం తెరుచుకుంది. దాదాపు రెండేళ్లుగా పనిచేయని సీసీ కెమెరాలు పనిచేయడం ప్రారంభించాయి. విశ్వవిద్యాలయం న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లే క్రమంలో రోడ్లు తవ్వేటప్పుడు సీసీ కెమెరాలకు సంబంధించిన కనెక్షన్‌లు అన్నీ కట్ అయిపోయాయి. తర్వాత అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో రెండేళ్లుగా కెమెరాలు పనిచేయకుండా అలంకారప్రాయంగా మారాయి. ఈనేపథ్యంలో ఇటీవల విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న పలు సంఘటనలు సీసీ కెమెరాల ఆవశ్యకతను చాటిచెప్పాయి. దీంతో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్దన్ సీసీ కెమెరాల ఆవశ్యకతపై దృష్టి సారించారు. ఐటీసెల్ డైరెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిబ్బంది రంగంలోకి దిగారు. మొత్తం లైన్లు ఎక్కడెక్కడ్ పోయాయో పరిశీలించి ఉన్నంతలో వాటిని సిద్ధం చేశారు. విశ్వవిద్యాలయంలో 73 సీసీ కెమెరాలు ఉండగా (ప్రిన్సిపాల్ కార్యాలయం మినహా) ఇప్పటి వరకు 50 సీసీ కెమెరాలు పనిచేసేలా చేయగలిగామని, మిగతా వాటిని మరో రెండుమూడురోజుల్లో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటీ సెల్ డైరెక్టర్ ఎం.వి. శంకర్ తెలిపారు.

ఆప్కోలో చేనేత క్లియరెన్స్ సేల్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉగాది పండుగను పురస్కరించుకుని ఆప్కోలో ఎంపిక చేసిన వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు ధరలతో క్లియరెన్స్ సేల్‌ను ప్రారంభించామని ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి వరప్రసాద్‌రావు తెలిపారు. 1+1, 1+2 ప్రత్యేక ఆఫర్లను అమలు చేస్తున్నామన్నారు. క్లియరెన్స్ సేల్ కౌంటర్‌ను ఆప్కో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. చేనేత కళాకారులు మగ్గంపై నేసిన ధర్మవరం, మాధవరం, ఉప్పాడ, చీరాల, గద్వాల్, పట్టు, కాటన్, బందర్, రెడీమేడ్ షర్టులు, టవళ్లు, డ్రస్ మెటీరియల్, లుంగీలు, ధోవతులు, ఇతర వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేలాడే వైర్లను తొలగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలో రోడ్డుపైన వేలాడే వైర్లను తొలగించాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో రోడ్లపై కిందికి వేలాడుతున్న వైర్లను ఆర్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వేలాడుతున్న వైర్లు వాహనదారులకు కనబడక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే ఈ వైర్లు కిందకు వేలాడుతుండడం ఆందోళనకరమన్నారు. అధికారులు స్పందించి వైర్లను తొలగించాలని కోరారు.

తల్లిదండ్రుల ఆశలను నిజం చేయండి



విద్యార్థినిల సాంస్కృతిక ప్రదర్శన

కడప కల్చరల్ : తల్లిదండ్రుల ఆశలను నిజం చేసేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఆర్తీ హోం కార్యదర్శి దుర్గాకుమారి అన్నారు. కడప మున్సిపల్ స్టేడియం వద్దగల ఆర్తీ పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దుర్గాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర అంశాలపై తల్లిదండ్రుల సూచనల మేరకు శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రత్యేక అతిథి అరుణారెడ్డి , కబీర్ అహ్మద్ మాట్లాడారు. వీఎఫ్‌టీ ఆర్తీ స్కూలు వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సంధ్య, డైరెక్టర్ భాగ్యమ్మ విద్యార్థులకు అభినందనలు తెలిపి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. చివరగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగల సంప్రదాయాల గురించి ప్రచారం

కడప కల్చరల్ : స్థానిక మృత్యుంజయకుంటలో సోమవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కడప శాఖలు పండుగలు, సంప్రదాయాల గురించి స్థానిక వీధుల్లో ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత–మన పండుగలు అనే అంశంపై సంస్థల ప్రతినిధులు ఆ ప్రాంతీయులకు వివరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ రచించిన వంద రకాల త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి వారికి పరిచయం చేసి అందులోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కడపశాఖ అధ్యక్షులు నవనీశ్వర్‌రెడ్డి, సభ్యులు ఈశ్వర్, నాగేంద్ర, యల్లారెడ్డి, హేమలత, గంగమ్మ, సదానందలు పండుగ రహస్యాన్ని గురించి వివరించారు.

అసెంబ్లీలో టీడీపీ సభ్యుల తీరు అనాగరికం

కడప కార్పొరేషన్: రాష్ట్ర శాసన సభలో తెలుగుదేశం పార్టీ సభ్యులు వ్యవహరించిన తీరు అనాగరికంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, కడప మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో టీడీపీ ఎమ్మెల్యేలు ఇలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరించడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ప్రముఖులు కాల్‌టెక్స్ హఫీజుల్లా తదితరులు

కడప కల్చరల్ : కడప నగరంలోని కాగితాలపెంటలోగల హజరత్ సయ్యద్‌షా రసూల్‌షా ఖాద్రి సాహెబ్ దర్గా ఉరుసు ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి కుమారుడు సయ్యద్ సాదిక్‌పాషా ఖాద్రీ సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గా గురువుల మజార్‌కు పూల చాదర్, అనంతరం గంధం సమర్పించారు. ఫకీర్ల మేళతాళాలు, బ్యాండు వాయిద్యాల మధ్య కార్యక్రమం సందడిగా కొనసాగింది. కార్యక్రమంలో నగర ప్రముఖులు కాల్‌టెక్స్ హఫీజుల్లా, హరిప్రసాద్, నయీం బుఖారి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వెనుకగల తారక రామనగర్‌లోని శ్రీ అంకాలమ్మ ఆలయ ఉత్సవాలను బుధ, గురు వారాలలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు లింగారెడ్డి, విశ్వనాథరెడ్డిలు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం అభిషేకం, లోక కల్యాణం కోసం శాంతిహోమం నిర్వహిస్తారన్నారు. రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న మధ్యాహ్నం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 10 గంటలకు స్థానిక కళాకారుల చెక్క భజన ఉంటుందని వివరించారు.

వ్యక్తిపై దాడి

కడప అర్బన్: నగరంలోని సాయిపేటలో కూడలి సమీపంలో షేక్ జావేద్ అనే వ్యక్తిని గత రాత్రి రహమత్ అలియాస్ గోరా అనే వ్యక్తి, తన స్నేహితులతో కలిసి వచ్చి దాడి చేశాడు. రహమత్ అదే వీధిలో ఆటో పెట్టడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ జావేద్ అభ్యంతరం తెలిపారు. పెద్దల సమక్షంలో గతంలో ఆటో తీయించారు. మళ్లీ ఈనెల 19న రాత్రి అదే స్థలంలో ఆటో పెట్టడంతో రహమత్ తన స్నేహితులతో జావేద్ ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణ పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

నష్టపరిహారం అందించేందుకు కృషి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: మండలంలో గాలీ వానకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం తంగెడుపల్లె గ్రామంలో దెబ్బ తిన్న పంటలను ఆయన పరిశీలించారు. పంటలు చేతికొచ్చే సమయంలో గాలీవానతో పూర్తి స్థాయిలో నష్ట పోయామని పలువురు రైతులు కన్నీరు పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం జరిగిన నష్టాన్ని చాలా మంది రైతులు ఫోన్ ద్వారా తెలియజేశారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నిమిత్తం విజయవాడలో ఉండటంతో వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి నష్ట పరిహారాన్ని అంచనా వేయాలని జిల్లా కలెక్టరుకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఏ రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని, పంట నష్ట పోయిన ప్రతి రైతును గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ జేడీఏ మాట్లాడుతూ ఇప్పటికే ప్రాథమిక అంచనా వేశామని, త్వరలో పూర్తి స్థాయిలో అంచనా వేసి సామాజిక తనిఖీ నిమిత్తం ఈ నెల 30వ తేదీ రైతు భరోసా కేంద్రంలో జాబితాను ప్రదర్శిస్తామని, ఏవైనా తప్పులు ఉంటే రైతులు తెలియజేస్తే వాటిని సరిదిద్దుతామన్నారు. – కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, , మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డీడీ హెచ్ సుభాషిని, మండల హార్టికల్చర్ అధికారి రెడ్డెయ్య, కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, తహసిల్దార్ ఉదయభారతి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరభద్రారెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్సుపై జాతీయ సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ విభాగం వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ పురోగతిపై ఒక్కరోజు అడ్వాన్స్ ఇన్ కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ అనే అంశంపై జాతీయస్థాయి కాన్ఫరెన్స్ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరు యోగివేమన విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు నాగరాజు హాజరై మాట్లాడారు. కళాశాల వైస్ చైర్మెన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి చర్యలు



'స్పందన' కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న సీపీ సంజీవ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి

కడప కార్పొరేషన్: 'స్పందన'కు వచ్చే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిటీప్లానర్ సంజీవ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 38 అర్జీలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి-9, ఇంజినీరింగ్-6, పబ్లిక్ హెల్త్-4, రెవెన్యూ విభాగం-5, యూపీఏ విభాగం-3, మెప్మా-1, హౌసింగ్-8, కడప తహసీల్దార్-1, ఏపీఎస్‌పీడీసీఎల్-1 వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఎంహెచ్ఓ డా. ప్రశాంత్‌వర్ధన్, డీఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

ఉగాదికి వేళాయె

కడప కల్చరల్ : కడప నగరంలో ఉగాది పండుగ నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. వైష్ణవాలయాన్నీ ఇప్పటికే పండుగ ఏర్పాట్లతో కళకళలాడుతున్నాయి. దాదాపు అన్ని ఆలయాలలో బుధవారం ఉదయం 10 గంటలకు లేదా సాయంత్రం 5 గంటల తర్వాత వేద పండితులను పిలిపించి నిర్వాహకులు పంచాంగ పఠనం చేయించనున్నారు. ఇందుకు తగినట్లుగా ఆలయ ప్రాంగణాలలో వేదికలు సిద్ధం చేశారు.

కనుల పండువగా.. ఉగాది పండుగ నిర్వహణ కోసం దాదాపు అన్ని ఆలయాలలో నిర్వాహక కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. వారి ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆలయాలకు మామిడి తోరణాలు, కొబ్బరిమట్టలు, అరటిబోదెలు అలంకరించే ఏర్పాట్లలో ఉన్నారు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో ఆలయ మంగపంలో ఆస్థాన పూజలు నిర్వహించనున్నారు. హౌసింగ్‌బోర్డులోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, జవ్వ శి బజారులోని శ్రీ కోదండ రామాలయం, ఇందిరానగర్‌లోని భద్రాద్రి రామాలయం, రవీంద్రనగర్‌లోని సీతారామంజనేయస్వామి ఆలయం, గడ్డిబజారులోని లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంతోపాటు నగరంలోని అన్ని వైష్ణవాలయాలు ఉగాది పర్వదినాన్ని నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి.

స్వామి తురియానందచే .. చిన్మయమిషన్ జిల్లా అధ్యక్షులు, శ్రీ లలితా పంచాయతన ఆలయ నిర్వాహకులు స్వామి తురియానంద ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో మూడు రోజులపాటు శ్రీమద్ రామాయణమహాకావ్యంపై ప్రవచనం చేయనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు రామాలయంలో పూజలు నిర్వహించి ప్రవచనాలు ప్రారంభిస్తారు.

22న ఉగాది 'జన కవనం'

కడప కల్చరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం ఉదయం 11 గంటలకు సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో జన కవనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సాహితీ స్రవంతి కన్వీనర్ బండి లెనిన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు కుమారస్వామి తెలిపారు. ఇప్పటికే ఈ అంశంపై జిల్లా స్థాయిలో కవితల పోటీ నిర్వహించామని, ఇందులో విజేతలైన వారికి ఈ ఉగాది నాడు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారని వివరించారు.

మార్కెట్లలో 'పంచాంగం' కళ



మార్కెట్లో సిద్ధంగా ఉన్న పంచాంగాలు

కడప కల్చరల్ : భవిష్యత్తు తెలుసుకోవాలన్న ఆసక్తి దాదాపు అందరిలోనూ ఉంటుంది. వాటికోసం కొందరు జ్యోతిష్యాన్ని ఆశ్రయిస్తే...మరికొందరు పంచాంగాలను పరిశీలిస్తారు. జ్యోతిష్య పండితులు సైతం ఈ విషయంగా పంచాంగాల పైనే ఆధారపడతారు. ఈ ఆసక్తిని ఆధారంగా చేసుకుని పలువురు పండితులు ఉగాదికి ముందు పంచాంగాలను ప్రచురిస్తారు. వాటిలో టీటీడీ పంచాంగానికి మంచి డిమాండ్ ఉంది.

సంప్రదాయాల్లో భాగం

తెలుగు పండుగ అనగానే తెలుగింటి సంప్రదాయాలు గుర్తుకు వస్తాయి. ఉగాది పచ్చడి సేవనం, పంచాంగ పఠనం, శ్రవణం, కవి సమ్మేళనం తదితరాలతో పండుగ సందడి కనిపిస్తుంది. తెలుగు వారు వీలైనంత వరకు ఈ సంప్రదాయాలను పాటించేందుకే ప్రయత్నిస్తారు. ప్రసార మాధ్యమాల కారణంగా ఇటీవలి కాలంలో పండుగ సంప్రదాయాలకు మరింత ప్రచారం లభిస్తోంది. వాటిలో పూజలు, శుభకార్యాలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం పంచాంగాన్ని తిరగేయడం ఎక్కువైంది. సాధారణంగా ఉగాది నుంచి ఉగాది వరకు పంచాంగంలో వివరాలు ఉంటాయి. వాతావరణం, వ్యవసాయం, నిత్యావసర వస్తువుల ఉత్పత్తి, ధరలు, వినియోగం తదితర అంశాల గురించి పంచాంగంలో ఉంటుంది. సమాజంపై అమితంగా ప్రభావం చూపే రాజకీయాల ప్రస్తావన కూడా ఉంటుంది.పండుగ రోజున ఉదయం లేదా సాయంత్రం దేవాలయాల ప్రాంగణాలలో వేద పండితులు, పంచాంగకర్తలు మళ్లీ ఉగాది వరకు జరగబోయే ముఖ్యమైన అంశాలు, వర్షాలు, ధరలు తదితర పరిస్థితులు ఎలా ఉంటాయో చెబుతారు. తిథి, వార, నక్షత్ర, యోగా, కరణం...ఈ ఐదింటిని తెలిపేదే పంచాంగం.

దుకాణాలు కళకళ

పంచాంగాలు విక్రయించే దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. నిజానికి జనవరి నుంచే మార్కెట్లలో పంచాంగాల సందడి మొదలైంది. సాధారణ క్యాలెండర్ల స్థానంలో పంచాంగంతో కూడిన క్యాలెండర్లు మార్కెట్‌కు వచ్చాయి. ప్రస్తుత ప్రత్యేకంగా పంచాంగాలు అందుబాటులోకి వచ్చాయి.

రకరకాల....మార్కెట్లలో 20 రకాల పంచాంగాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో తిరుమల-తిరుపతి దేవస్థానాల (టీటీడీ) పంచాంగానికి మంచి గుర్తింపు ఉంది. ఎక్కువ శాతం మంది దీన్నే ప్రామాణికంగా భావిస్తారు. గంటల పంచాంగాలు 30 నుంచి 50 రూపాయలలోపు లభిస్తున్నాయి. పుస్తకం పంచాంగాలు రూ. 10-80, పెద్ద పంచాంగాలు రూ. 70-90లకు విక్రయిస్తున్నారు.